ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

భూ ఆక్రమణలపై మౌనమేల..!

- రోడ్డు పక్కనే వాగుల చదును
- జోరుగా శాశ్వత భవన నిర్మాణాలు
- పరవాడలో ప్రభుత్వ భూములు పరుల పరం
- చర్యలకు రెవెన్యూ వెనుకడుగు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

జిల్లాలోని పరవాడ మండల కేంద్రంలో ప్రజలు నిత్యం తిరిగే రహదారి పక్కనున్న ప్రభుత్వ వాగులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణల పాలవుతున్న కోట్ల విలువైన వాగులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా మౌనంగా వుంటున్నారు. స్థానికులు చేసిన ఫిర్యాదులపైనా వారు స్పందించడం లేదు. దీంతో ఆక్రమణదారులకు సహకరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ బోనంగి రెవెన్యూలో ఆక్రమణకు గురైన స్థలం

మండలంలోని ఈ బోనంగి సర్వే నెంబర్ 297లో గెడ్డవాగు 76 సెంట్లు, పాతగొర్లెవానిపాలేనికి వెళ్లే దారికి అనుకొని, ప్రధాన రహదారి పక్కనున్న సర్వే నెంబర్ 293లో ఎకరా 36 సెంట్లు గెడ్డవాగును ప్రయివేటు వ్యక్తులు చదునుచేసి ఆక్రమించారు. ఈ రెండు సర్వే నెంబర్లలోని రెండెకరాల 12 సెంట్లు భూమి విలువ రూ.30 కోట్లకుపైగా ఉంటుంది. ఆక్రమించిన వాగులు కనిపించని మారుమూల ప్రాంతాల్లో ఏమీలేవు. విశాఖపట్నం - యలమంచిలి ప్రధాన రహదారిలో పరవాడ పోలీసు స్టేషన్‌కు సమీపంలో ఈ ఆక్రమణలు ఎంతోకాలంగా సాగుతున్నాయి. స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగో, మొహమాటమో మిగతా 2లో..



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఎంఎస్‌ఎంఇ సెట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

భారత ప్రభుత్వ ఎంఎస్‌ఎంఇ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి విశాఖలో నిర్వహించిన ఎంఎస్‌ఎంఇ సెట్ - 2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ ఎన్.విజయమోహన్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీతో పాటు అచ్యుతాపురంలోని ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్‌లో తలపెట్టిన ఈ పరీక్షకు 600 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా విశాఖపట్నంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ కేంద్రంలో 219 మంది విద్యార్థులకుగాను 178 మంది, అచ్యుతాపురంలోని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

భూ ఆక్రమణలపై మౌనమేల..!

సర్వే నెంబర్ 293లోని వాగు స్థలంలో ఉన్న హెచ్చరిక బోర్డు

ఏమోగానీ మండల స్థాయి రెవెన్యూ అధికారులు అచేతనంగా వ్యవహరిస్తున్నారు. ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ సైతం కఠినంగా లేకపోవడంతో ప్రభుత్వ భూములు, వాగులు ఇలా పరులపరమవుతున్నాయి.

భూ ఆక్రమణలపై ఉదారం వీడి నిష్పాక్షిక విచారణ, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ వంటి నిఘాను పటిష్టపర్చి చర్యలు తీసుకుంటే కొంతవరకైనా ఆక్రమణలు తగ్గేవి. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న భూ ఆక్రమణలపై కలెక్టర్ సైతం మౌనం వహించడంతో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఈ బోనంగి సర్వే నెంబర్ 297లో 76 సెంట్లు, సర్వే నెంబర్ 293లో ఎకరా 36 సెంట్లు గెడ్డవాగు ఆక్రమణ ఎంతోకాలంగా జరుగుతోంది. ఆక్రమణలను నియంత్రించకుండా సహకరించేలా కొంతమంది రెవెన్యూ అధికారులు వ్యవహరించిన ఫలితంగా ఆక్రమణలు రెట్టింపు అవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు, వాగులు చదునుచేసినప్పుడు అడ్డుకోకుండా సొమ్ము చేసుకోవడానికి కొంతమంది రెవెన్యూ సిబ్బంది అలవాటుపడటంతో ప్రయివేటు వ్యక్తుల ఆక్రమణలకు ఊతమిచ్చినట్లవుతోంది.

293 సర్వే నెంబర్‌లో గెడ్డను కప్పి అక్రమించడంపై 2018లో స్థానికులు ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణలో ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఆ ప్రభుత్వ భూమిలోకి అనుమతిలేకుండా ప్రవేశించినా, అక్రమించడానికి ప్రయత్నించినా సెక్షన్ 4 (1), (2), (3) కింద ఎపి ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు 1982 ప్రకారం చర్యలు తీసుకుంటామని నాటి కలెక్టర్ హెచ్చరిక బోర్డు పెట్టించారు. ప్రభుత్వ భూమిలో కలెక్టర్ పెట్టించిన బోర్డును తొలగించి, వాగును కప్పేసి, భూమిని చదునుచేసి బస్సులు, ఇతర వాహనాలకు ఆ స్థలం వినియోగిస్తున్నారు. శాశ్వత నిర్మాణాలూ చేపట్టారు. హెచ్చరిక బోర్డు తొలగించి వాగు ఆక్రమించిన వ్యక్తిపై చర్య తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు వెనుకాడుతున్నారు.

సర్వే నెంబర్ 297లో వాగుగా ప్రభుత్వ రికార్డుల్లోవున్న 76 సెంట్లును వెబ్‌ల్యాండ్‌లో జిరాయితీగా నమోదు చేసి అక్రమణదారులకు అండగా మండల రెవెన్యూ సిబ్బంది నిలబడ్డారు. ఈ వ్యవహారం బయటకు వచ్చాక స్థానికుల ఫిర్యాదుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన వాగు స్థలాన్ని రెడ్ మార్క్‌లో పెట్టారు. మార్పులు, చేర్పులకు తమకున్న అధికారిక అవకాశాలను అక్రమణదారులకు తోడ్పడ్డానికి ఉపయోగిస్తున్నారు. అక్రమణదారులతో కుమ్మక్కయి కొందరు అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. తహశీల్దార్ ఆఫీసు వెనుకవున్న మినరల్ వాటర్ ప్లాంట్ స్థలంలో కొంత ప్రభుత్వ భూమి వున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. పలుకుబడి కలిగిన వ్యక్తులకు చెందినదంటూ ఆక్రమణ జోలికి వెళ్లడంలేదు. జాయింట్ సర్వే చేయాలని దాదాపు రెండేళ్ల క్రితం తహశీల్దార్ దృష్టికి నీటిపారుదల శాఖాధికారులు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇంత జరుగుతున్నా ఈ ఆక్రమణలు తమ దృష్టికి రాలేదని రెవెన్యూ అధికారులు చెబుతుండటం గమనార్హం.

ప్రశాంతంగా ఎంఎస్‌ఎంఇ సెట్

ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్లో 381 మందికిగాను 219 మంది హాజరయ్యారని వెల్లడించారు. ఈ పరీక్షలను విజయ్ మోహన్ పర్యవేక్షణలో ఎంఎస్‌ఎంఇ సెట్ 2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి.సిద్దయ్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్షా ఫలితాలను ఈ నెల 19వ తేదీన విడుదల చేయనున్నారు.

సిహెచ్‌ఒలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఒ)ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 14వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డిమాండ్లతో కూడిన బ్యానర్ ప్రదర్శిస్తూ సిహెచ్‌ఒలు నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలన్నారు. పిఎఫ్ కటింగ్ రెండు సంవత్సరాలుగా నిలిపివేశారని, ఇది సరికాదని, పాత పద్ధతిని కొనసాగించాలని అన్నారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సిహెచ్‌ఒలకు మినహాయింపునివ్వాలన్నారు. కార్యక్రమంలో కల్పన, దివ్య, కల్యాణి, భవాని, అరుణ, మానస పాల్గొన్నారు.

ఎయులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఐఎఎస్‌ఇ (ఇన్స్టిట్యూట్ అఫ్ అడ్వాన్స్డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్) కళాశాలలో 2001- 2002 బ్యాచ్‌కు చెందిన బిఇడి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ప్రస్తుతం వారు పనిచేస్తున్న వృత్తి, వ్యక్తిగత జీవితం గురించి ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి వారి ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజాకుమారి, ఆచార్య శివప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విద్యావతిలను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని, దానికి తమ ఇఐఎఎస్‌ఇ పూర్వ విద్యార్థులే ఉదాహరణ అని అన్నారు. కార్యక్రమంలో పేద విద్యార్థులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు.

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కృషి

- కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- చిన్నారులను కూలీలుగా పెట్టుకుంటే యజమానులకు కఠిన శిక్షలు
- కార్మిక చట్టాలను అమలు చేయాలి
- 'ప్రజాశక్తి'తో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కె.వసంతరావు

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్ : జిల్లాలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం సమన్వయంతో కృషి చేస్తున్నామని అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కె.వసంతరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల గుర్తింపు, చైల్డ్ లేబర్, లేబర్ లాస్‌ను పట్టించుకోని వారికి వేసే శిక్షలు వంటి అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు

జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు ఎంత మంది ఉన్నారు ?

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ పథకానికి ప్రభుత్వం 10 లక్షల కార్మికుల గుర్తింపు లక్ష్యాన్ని ఇచ్చింది. ఈ ఏడాది జనవరి 29 నుంచి ఇప్పటి వరకు 64,347 మందిని గుర్తించాం.

ఈ శ్రమ్ పథకానికి అర్హతలు, పథకంతో లాభం ఏంటి ?

16 నుంచి 59 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ అర్హులే. ఇఎస్‌ఐ, పిఎఫ్ పరిధిలో ఉండరాదు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించనవసరం లేదు. పథకంలో భాగంగా ఇచ్చే ఈ ఐడి కార్డు జాతీయ సామాజిక భద్రత పథకం కింద ఏ స్కీం పెట్టినా పనిచేస్తుంది. ఈ పథకంతో ప్రమాద బీమా రెండు లక్షల వరకు వస్తుంది.

ఎప్పటి వరకు ఈ శ్రమ్ పథకం కింద చెల్లింపులు జరిగాయా ?

ఇప్పటివరకూ ఏడుగురుకు ఒక్కొక్కరికీ రెండు లక్షలు చొప్పున రూ.14 లక్షల పరిహారం అందజేశాం.

చైల్డ్ లేబర్ అంశంపై మీ చర్యలేంటి ?

14 ఏళ్ల వయసులోపు ఉన్న చిన్నారులను ఎవరూ పనిలో పెట్టుకోకూడదు. అలా ఎవరు పెట్టుకున్నా శిక్షార్హులు. చైల్డ్ లేబర్‌ను గుర్తించేందుకు ప్రతి బుధవారం స్పెషల్ డ్రైవ్ చేస్తున్నాం. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఎస్‌హెచ్‌ఒ, ఐసిడిఎస్, ఎన్‌జిఒ, సిడబ్ల్యూసి తదితర శాఖల సిబ్బందితో ప్రత్యేక టీంలతో గుర్తిస్తున్నాం. గుర్తించిన పిల్లలను సర్వ శిక్ష అభియాన్ హాస్టల్‌లోగానీ, స్కూల్లోగానీ వేస్తాం. చిన్నారులను ఎవరు పనిలో పెట్టుకున్నా బాధ్యులకు రూ.20 వేల జరిమానా వేస్తాం లేదా ఆరు నెలల జైలు శిక్ష ఉంటుంది.

భవన నిర్మాణ కార్మికులకు పరిహార చెల్లింపులు ఎలా ఉన్నాయి ?

గతంలో భవన నిర్మాణ కార్మికులకు 5 లక్షల పరిహారం ఇచ్చేవారం. ప్రస్తుతానికి నిధుల కొరతతో ఆ చెల్లింపులు శాఖా పరంగా జరగడం లేదు. భవన నిర్మాణ కార్మికులు నేరుగా విశాఖలోగానీ, అనకాపల్లిలోగానీ అప్లై చేయవచ్చు.

వ్యాపారులకు, బాధితులకు మీరు ఇచ్చే సూచన ?

వ్యాపారులు, భవన నిర్మాణ యజమానులు తప్పక లేబర్ లాస్ పాటించాల్సిందే. కార్మికులకు జీతాలు, సెలవులు, ఇఎస్‌ఐ, పిఎఫ్, గ్రాడ్యుటీ వంటి సౌకర్యాలు కల్పిస్తూ రికార్డులు మెయింటైన్ చేయాలి. అలా చేయకుంటే చర్యలు తీసుకుంటాం.

ప్రత్యామ్నాయ రాజకీయ విధానం అవసరం

మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించి, రాష్ట్రాల్లోనూ అధికారంలోకి రావాలని బిజెపి ప్రయత్నిస్తోందని, దీన్ని గుర్తించి ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరముందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు బిజెపి అన్ని దుర్మార్గాలకూ పాల్పడుతోందని, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. విశాఖలో జరుగుతున్న ఆ పార్టీ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దేశంలోని రాజకీయ వాతావరణం, పార్టీ కార్యాచరణ, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై మాట్లాడారు. మతాన్ని రాజకీయ ఆయుధంగా బిజెపి వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల మధ్య చిచ్చుపెట్టి, చీల్చి తమ వైపు తిప్పుకొని అధికారంలోకి వస్తోందని విమర్శించారు. అయితే బిజెపి ప్రయత్నాలు అన్నిసార్లూ పనిచేస్తాయని భావించాల్సిన అవసరం లేదన్నారు. మనదేశంలో ప్రజలు మతం ఆధారంగా ఓట్లు వేసే పరిస్థితి లేదని చెప్పారు. 2014లో కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాల వల్ల బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆ పార్టీ చెప్పిన డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మూడోసారి 420 సీట్లు సొంతంగా గెలుస్తామని చెప్పి నేరుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సీట్లు కూడా బిజెపి తెచ్చుకోలేకపోయిందని గుర్తు చేశారు. తొలుత సిపిఐ సీనియర్ నాయకులు పల్లెటి పోలయ్య పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కె.వనజాక్షి, కె.సత్య నారాయణ, ఆర్.శ్రీనివాసరావు అధ్యక్ష వర్గంగా మహాసభకు వ్యవ హరించారు.

పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, పి.దుర్గా భవాని, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్య నారాయణమూర్తి, ఎజె.స్టాలిన్, డి.ఆదినారాయణ, సిహెచ్. రాఘవేంద్రరావు, ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు కలిసిరావాలి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడం ద్వారా ప్రపంచశాంతి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాష్‌రావు అన్నారు. ఎయు విద్యా విభాగంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం, దేశ సమైక్యతను పెంపొందిద్దాం - మేరా భారత్ మహాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద నిర్మూలనకు భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కి ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల నుంచి సంఘీభావం లభిస్తోందని చెప్పారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ పాల్గొన్నారు.

ఘనంగా ప్రతాప్ రుద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: చినవాల్తేరు మహమ్మదీయ మస్జిద్ ఆవరణలో తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పేదలకు చీరలు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర పాల్గొన్నారు.

ఆరిలోవ : ప్రతాపరుద్ర జన్మదినోత్సవాన్ని 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన అన్నా క్యాంటీన్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు.

నోటీసు
మహారాజాశ్రీ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.220/2016 :: I.A.326/2024

Between :
గుడ్ల రామగణేష్ రెడ్డి వగైరాలు ...పిటీషనర్లు/వాదులు
And:
నీలాపు ఎల్లయ్యమ్మ వగైరాలు...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
To :
R5. వల్లభనేని లీలాజీబాబు, S/o వెంకటరావు, రియల్ ఎస్టేట్ బిజినెస్, డోర్ నెం. 49-9-3, ఇ.ఎల్.ఆర్.విజన్, ప్లాట్ నెం. 203, 3వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్టణం.

పిటిషనర్ పై నెంబరు గల పిటిషన్ లో కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించినను మీరు సదరు నోటీసును అందుకోనందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఈ నోటీసు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయమన్నందున, మీ పైన పిటీషనర్ గారు వేసిన పిటిషన్‌లో స్వతహాగా గాని, సంపూర్ణముగా సంజాయిష్ పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తర్వులు చెప్పుగూడిన ప్లీడర్ ద్వారాగా గాని సదరు పిటిషన్‌కు ప్రత్యుత్తరం చెప్పగలందులకు **తేది.16.06.2025 దీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి యెదుట హాజరు కావలెను. సదరు పై నెంబరు గల పిటిషన్లో మీకు ఏమైనా నిక్షేపణలు ఉన్న యెడల మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి కోర్టు వారికి మనవి చేసుకోవలెను. లేని యెడల సదరు పిటీషన్ను మీ పరోక్షమున విచారించి తీర్మాణము చేయుదురు అవి ఈ పత్రికా ప్రకటన మూలముగా తెలియజేయడం అయినది.

P. హరగోపాల్
అడ్వకేట్, విజయనగరం
Cell No.:9440721142

ప్రసరించిన విజ్ఞాన చైతన్యం

- విద్యార్థులకు ప్రయోజనకరంగా వేసవి శిబిరాలు
- పిల్లల్లో వినోదం, విజ్ఞానం పెంపుదల

భీమిలి శాఖా గ్రంథాలయం వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థుల్లో ప్రతిభ, వారి సామర్థ్యాన్ని అంచనావేస్తూ, ఆ దిశగా అవసరమైన పుస్తకాలను అందిస్తూ, వారిలో వినోదం, విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందించేలా పౌర గ్రంథాలయ సంస్థ అధ్వర్యాన స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీన ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం జూన్ 6వ తేదీ వరకు కొనసాగనుంది. 8 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. గత 10 రోజుల నుంచి కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరానికి పిల్లల నుంచి స్పందన లభిస్తోంది.

ఏమి నేర్చుకున్నారు...

కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్ర లేఖనం, బాల సాహిత్యం, పద్యాలు, పఠనాభిరుచి, అందమైన చేతి రాత ఇలా అనేక అంశాలపై శాఖా గ్రంథాలయంలో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. నలుగురితో ఎలా కలవాలి, మంచి వైపుగా ఎలా ఆలోచించాలి ఇలా అనేక అంశాలను పిల్లలకు నేర్పుతున్నారు.

గ్రంథాలయాల పట్ల ఆకర్షితులయ్యేలా..

వివిధ పాఠశాలలకు చెందిన 3 నుంచి 8వ తరగతి విద్యార్థులు రోజూ స్థానిక గ్రంథాలయానికి వచ్చి వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నారు. తెలుగు, ఇంగ్లీషు దిన పత్రికలు, ఇక్కడ అందుబాటులో ఉన్న అనేక పుస్తకాలను చదువుతున్నారు. పాఠశాలలు తెరిచాక ఆదివారం, ఇతర సెలవుదినాల్లో, పాఠశాల ముగిశాక సాయంకాల సమయాన గ్రంథాలయానికి వెళ్లొద్దాం అన్న ఆశక్తి పిల్లల్లో ఏర్పడింది. ఎనిమిదేళ్ల వయసు నుంచే గ్రంథాలయాల బాట పట్టించాలనేది సంస్థ ఆలోచన, కృషి మంచి ఫలితాలను ఇస్తుందనే చెప్పాలి. పిల్లలకు, ర్యాంకులు, మార్కులే జీవితం కాకుండా ఆట, పాటలు కూడా అవసరమేనని గుర్తించిన పౌర గ్రంథాలయ సంస్థ ఏకంగా 40 రోజుల పాటు వేసవి శిబిరం నిర్వహిస్తోంది.

కథల పుస్తకాలు చదువుతున్నాను

రోజూ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు చదువుతున్నాను. ప్రస్తుతం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో బోలెడన్ని కథల పుస్తకాలు చదువుతున్నాను. అంతే కాదు బాల సాహిత్యం కూడా చదువుతున్నాను.

కె.శ్రావ్యశ్రీ, 8వ తరగతి

ఎన్నో విషయాలు నేర్చుకున్నా

వేసవి శిబిరంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. గత 10 రోజులుగా అనేక మంది కవులు, రచయితలు రాసిన పుస్తకాలు చదివాను. సమయం ఉన్నప్పుడల్లా గ్రంథాలయానికి వెళ్తాను.

వి.లావణ్య, 8వ తరగతి

మంచి విషయాలు తెలిశాయి

క్యారమ్స్ ఆట ఆడుతున్నప్పుడు ఎంతో సరదాగా ఉంటుంది. బొమ్మలు గీయడం నేర్చుకున్నాను. తోటి విద్యార్థి కంటే మెరుగ్గా ఆడాలనే పట్టుదల పెరిగింది. వేసవి విజ్ఞాన శిబిరంలో మరెన్నో మంచి విషయాలు నేర్చుకున్నాను.



ఎస్.దేవేందర్ 8వ తరగతి

బతికే ఉన్నాను.. 'ఉపాధి' కల్పించరూ...

వరపుల దేముడు

ప్రజాశక్తి - ఆనందపురం: 'బతికే ఉన్నాను.. ఉపాధి కల్పించరూ' అంటూ ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఇచ్చాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతు వరపుల దేవుడు (50) అధికారులను వేడుకుంటున్నాడు. తాను బతికే ఉన్నా, రెండేళ్లుగా ఉపాధి హామీ పనులు చేస్తున్నా చనిపోయినట్లు రికార్డులో ఉందని, ఇప్పుడు పనులకు రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఇచ్చాపురం గ్రామంలో సుమారు 52 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయని, గ్రామంలో అందరూ ఉపాధి హామీ పనులకు వెళ్తుంటామని ఆయన చెప్పాడు. వరపుల దేముడు తండ్రి సూరిదేముడు ఇదే పేరుతో వేరే వ్యక్తి గ్రామంలో ఉండేవాడని, ఆయన రెండేళ్ల క్రితం చనిపోవడంతో తానే చనిపోయినట్లు రికార్డులో ఉందని, ఉపాధి హామీ పనులు చేసినా డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండేళ్లుగా చేసిన పనులకు డబ్బులు రాలేదని, కొత్తగా పనికి రావద్దని విఆర్‌పి చెప్పారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై గ్రామపంచాయతీలో తెలియజేసినా నేటికీ చర్యలు లేవని తెలిపాడు. తన పేరు మీద వచ్చిన అమౌంట్ గిడిజాల బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్నాయని, వాటిని అధికారులు ఇవ్వడం లేదని పేర్కొన్నాడు. ఈ విషయమై విఆర్‌పి సూర్యానారాయణను వివరణ కోరగా ఇదే పేరుతో ఉన్న దేవుడు మరణించడంతో అప్పటి నుంచి సమస్య వచ్చిందని, ఇతని కార్డు తొలగించి మరలా కొత్త కార్డు ఇచ్చేందుకు చర్యలు చేపడతామని అధికారులు చెప్పారని, కొత్త కార్డు రాకపోవడంతో పనులకు అనుమతించలేక పోతున్నామని ఆయన వివరణ ఇచ్చారు. అధికారులు పరిశీలించి చేసిన పనులకు వచ్చిన డబ్బుతోపాటు, కొత్తగా ఉపాధి హామీ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని బాధితుడు కోరుతున్నాడు.

కార్మిక నేత గంగాధరరెడ్డికి నివాళి

గంగాధరరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి -తగరపువలస : కార్మిక నేత ఎస్.గంగాధరరెడ్డికి చిట్టివలస జ్యూట్ కార్మికులు పలువురు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కాకాస కార్యాలయంలో ఆదివారం గంగాధరరెడ్డి 8వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాకాస నాయకులు దల్లి అప్పలరెడ్డి మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ కార్మికుల హక్కుల సాధనకు ఆయన జరిపిన పోరాటాలు నేటికీ స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో అనేక జ్యూట్ మిల్లుల కార్మికులకు నాయకత్వం వహించారన్నారు. చిట్టివలస జ్యూట్ యాజమాన్యం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడే క్రమంలో ఎన్నో నిర్బంధాలకు గురయ్యారని వివరించారు. జ్యూట్ కార్మిక వర్గానికి ఆయన అన్ని సందర్భాల్లోనూ అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కైలాస్‌రెడ్డి, ఎం.ఆదినారాయణ, జి.అప్పారావు, ఎన్.వరహాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో నిర్వహించే వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నటరాజ నాట్య మండలి, శ్రీకాకుళం చిన్నారులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మహాగణపతితో ప్రారంభం చేసి తారంగం, మూషిక వాహన, రామాయణ శబ్ధం, చక్కని తల్లికి చాంగు బల, అదివో అల్లదివో, గోవింద గోవింద, శివతాండవం, భావములోన, గణేష్ స్తుతి, అమ్మ భవాని, ఏకదంతాయ గేయాలకు వాసుదేవ, స్వాతి, స్నేహ, ఇందు, కీర్తి, సింధూజ, శ్రీయ, కె.హేమప్రియ, లలితంబ, అనూష నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలనాధికారి పర్యవేక్షించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపల్ పి.రామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు సుమారు 329 మంది, సెకెండ్ ఇయర్ విద్యార్థులు సుమారు 60 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఫస్ట్ ఇయర్ రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవని స్పష్టం చేశారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గోపాలపట్నం : లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన గోపాలపట్నంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలేనికి చెందిన అక్కిరెడ్డి బాబూరావు (52) ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మందుల కోసం గోపాలపట్నం హైస్కూల్ వైపుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో గోపాలపట్నం ప్రధాన రహదారి నుంచి హైస్కూల్ కింద రహదారిలో లారీ వస్తూ హైస్కూల్ గేటు వద్ద మలుపు తిరిగే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బాబూరావు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ తాతారావు (20) కూలి పని చేసుకుంటూ పశువులను కాస్తుంటాడు. మద్యం అలవాటు ఉన్నందున పెళ్లి కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం పశువుల షెడ్ వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి అప్పలకొండ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తప్పిన ముప్పు

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. ఎండాడ పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్‌పై ఇనుప గ్రిల్స్‌ను ఢీ కొట్టి అవతలి రోడ్డులోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ కారు నగరం నుంచి మధురవాడ వైపు వెళుతున్నట్లు స్థానికులు తెలిపారు. కారుకు అడ్డుగా ద్విచక్ర వాహనం రావడంతో దాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురి అయినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కాస్మిక్ హౌస్ రెస్టో బార్ పబ్‌పై కేసు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహం సమీపంలోని కాస్మిక్ హౌస్ రెస్టో బార్ పబ్ లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించి రాత్రి 1:30 గంటల వరకు కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్టు పోలీసుల దృష్టికి రావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్టుమెంటు, త్రీ టౌన్ పోలీసులు సంయుక్తంగా సదరు పబ్‌పై శనివారం రాత్రి దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఆ పబ్‌కు మంజూరైన లైసెన్స్ ప్రకారం మద్యం అమ్మకానికి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, అలాగే ఆహార సరఫరాకు రాత్రి 12 గంటల వరకూ మాత్రమే అనుమతి ఉంది. ఆ నిబంధనను ఉల్లంఘించి రాత్రి 1.30 గంటల వరకు పబ్‌ను నడిపించినందున చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని త్రీ టౌన్ సిఐ పైడయ్య తెలిపారు.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

ప్రజాశక్తి-కశింకోట: మండలంలో బయ్యవరం గ్రామ పరిసర ప్రాంతంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ స్వామినాయుడు తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆదివారం దాడులు నిర్వహించగా పేకాటాడుతూ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ. 28,040 నగదు, 5 బైకులు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్ కుమార్, రైటర్ సూర్యారావు, కానిస్టేబుళ్లు మూర్తి, లక్ష్మణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పట్టుబడిన జూదరులతో పోలీసులు

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల మాతృదినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.

విశాఖ కలెక్టరేట్ : సమాజానికి ఉన్నత పౌరులను అందించాల్సిన బాధ్యత మాతృమూర్తులదేనని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి అన్నారు. శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి ఛారిటబుల్ ట్రస్ట్, ప్రకృతి చికిత్సాలయం (మహారాణిపేట) సంయుక్త నిర్వహణలో మాతృ దినోత్సవ వేడుకలు మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో ఆదివారం ఘనంగా జరి గాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సంధ్యాదేవి ముందుగా స్వాతంత్ర్య సమరయోధురాలు రూపాకుల విశాలాక్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రొఫెసర్ చిలుకూరి శాంతమ్మను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎవిఎన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సింగరాజు కృష్ణ కుమారి, సింగరాజు సతీష్ కుమార్, ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావు, తలాడ గిరిజ, చొక్కాకుల రాంబాబు, పల్లా చలపతిరావు, దేవర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 87వ వార్డులో వైసిపి సీనియర్ నాయకులు ఇల్లపు రాము ఆధ్వర్యాన మాతృ దినోత్సవ సందర్భంగా నిరుపేదల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, కర్రి నాగేశ్వరరావు, గుంట్ల శ్రీను, లక్ష్మి, బుగిడి రామలక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి గోపాలపట్నం ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రిలోని మాతృమూర్తి విగ్రహానికి గోపాలపట్నం కళా సేవా పీఠం ఆధ్వర్యాన పూలమాలలు వేసి నమస్సుమాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కేతు నాగలక్ష్మిని సన్మానించారు. కీర్తిశేషులు కోన వెంకటరావు కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నందవరపు సోములు, గోరపల్లి బంగార్రాజు, గోరకల రామదాసు, కంపర కనకరాజు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న చింతలపూడి తదితరులు

కె. కోటపాడు : మాతృదినోత్సవం సందర్భంగా కె.కోటపాడు అంగన్వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులతో వారి తల్లులకు పూలతో పాదపూజ చేయించి, పాదాభివందనం చేయించారు.. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ డోకల కుమారి, భూపతి లక్ష్మి అంగన్వాడీ పరిధిలోని తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో మాతృదినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దిబ్బిడి, బుచ్చయ్యపేట తదితర గ్రామాల్లో కేక్ లను కట్ చేసి పిల్లలు తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు.

బిసి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యమని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అంగడాల పూర్ణచంద్రరావు తెలిపారు. బిసి సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశం ఆదివారం పౌరగ్రంథాలయంలో కట్టా మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, రిజర్వేషన్లను 50 శాతం లిమిట్ చేయడాన్ని ఎత్తివేయాలని, ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను పున్ణ సమీక్షించాలని కోరారు. చట్టసభల్లో బిసి రిజర్వేషన్లు కల్పించాలని, మహిళ రిజర్వేషన్లను బిసిలకు కల్పించాలని, బిసి రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమస్యలపై బిసి సమన్వయ కమిటీ పోరాటం చేస్తుందన్నారు. బిసిలందరినీ కలుపుకుని పార్టీలకతీతంగా బిసి సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో ఆరు జిల్లాలకు అధ్యక్ష కార్యదర్శులను, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను నిర్మాణం చేసుకొని పోరాటం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బిసి సమన్వయ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడరెడ్డి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, కోశాధికారి పొట్నూరి దేవి, అధికార ప్రతినిధి అల్లు రమణ కార్యవర్గ సభ్యులు గొగుల ఆంజనేయులు పోవా రమేష్, ఒర్సు భాస్కర్, ఎర్రగుంట్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

'ఎన్‌టిఆర్ జయంతిని అధికారికంగా జరపాలి'

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతిని ఈ నెల 28వ తేదీన కూటమి ప్రభుత్వం అధికారికంగా జరపాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ కోరారు. భీమిలిలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే విషయం ఇప్పటికే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. తమ తండ్రి పేరిట స్థాపించిన బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్‌టిఆర్ జయంతి రోజునే సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-మాధవధార : మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. పప్పల శ్రీరామమూర్తి, రంగనాయకి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు పప్పల వరాహ నరసింహ (పోలీస్), కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ కో-ఆర్డినేటర్ పప్పల రామమోహనరావు, శ్రీ మాధవ యువజన సమాజం సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, రామకృష్ణ, దివ్యభారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పప్పల వరాహ నరసింహం, భగవతి శ్రీరామమూర్తి, పప్పల శ్రీహరి, వావిలాపల్లి వెంకటరావు, పేడాడ రాము, పేడాడ నరసింగరావు, సనపల వర, సనపల సత్యనారాయణ పాల్గొన్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న ముఖ్య అతిథులు

లాండ్రీ షాపులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

ధర్నా చేస్తున్న రజక వృత్తిదారులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రజకుల లాండ్రీ షాపులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని లాండ్రీ వృత్తిదారుల సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సీతమ్మపేట రజకుల ధోబీఘాట్ వద్ద ఎం.అప్పారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచీకరణ సరళీకరణ విధానాలు అమలు చేయడం వల్ల చేతి వృత్తిదారులు వృత్తి, ఉపాధి, కోల్పోతున్నారన్నారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు రావడం వల్ల వృత్తిదారులు రోజు కూలీలుగా చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ అమలు చేస్తే చేతి వృత్తిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీనగర్, సీతమ్మపేట దోబీ ఘాట్లు వద్ద రజక వృత్తిదారులు 30 కుటుంబాలు రజక వృత్తి, లాండ్రీ షాపులు నిర్వహిస్తూ అక్కడే నివసిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో రజక వృత్తిదారులు వృత్తి చేయటకు దోబీ ఘాట్లు లేక, లాండ్రీలు చేయుటకు స్థలాలు లేక, నివసించుటకు పక్కా ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రజకుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. రజకులకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, జిఒ 18 ప్రకారం రజకుల లాండ్రీలకు స్థలం కేటాయించాలని, బిసి కార్పొరేషన్ ద్వారా లాండ్రీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ నెల 20న జరుగుతున్న కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యాన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.ఈశ్వరరావు, ఎం.అప్పారావు, ఆర్.పోలయ్య, ఆర్.సత్యనారాయణ, టి.లక్ష్మి, వి.మునలయ్య, కె.లక్ష్మణ, పి.సింహాద్రి, ఎం.నాగమణి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ, రౌడీలు క్రమశిక్షణతో మెలగాలని, తగాదాలు, సెటిల్‌మెంట్లలో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎస్‌ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో అనాథ పిల్లలకు ఆదివారం రూ.20వేల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముందుగా పిల్లల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, స్థానికులు కె.చంద్రశేఖర్, ఎం.నరసింగరావు, వై.హరి, కె.జగన్నాథం, జి.సన్యాసిరావు, కె.రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం ఇఒగా సుజాత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పెందుర్తి: దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత ఆదివారం సింహాచలం దేవస్థానం ఇఒగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఇఒగా మొదటిగా అప్పన్నను దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నక్కాన ఆనంద్‌కుమార్, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు సాదర స్వాగతం పలికారు. సుజాత ముందుగా కప్పస్తంభం ఆ లింగన చేసుకొని, తదుపరి బేడా మండపం ప్రదక్షిణ చేశారు. స్వామి దర్శనం అనంతరము పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డివి.రామరాజు, ఆలయ పర్యవేక్షకులు జివిఎస్‌కె.ప్రసాద్, కంచి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే గమ్యానికి చేరుకోగలం

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : సాధనతోనే గమ్యానికి చేరుకోగలమని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కాకతీయ మైదానంలో సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన ఉచిత సమ్మర్ క్యాంప్ స్పోర్ట్స్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు నిర్దిష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థితికి చేరాలని కోరారు. తమ చిన్నతనంలో ఇటువంటి సౌకర్యాలు, ప్రోత్సాహకాలు లేవని పేర్కొన్నారు. ఈ ఉచిత వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉచిత వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి నూకరాజు, రాజారావు మాట్లాడుతూ, విద్యార్థుల కోసం క్రికెట్, కబడ్డీ, అథ్లెటిక్, బాక్సింగ్ తదితర క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక టిడిపి ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొడ్డు పాత్రుడు, జనసేన నాయకులు గంధం వెంకటరావు, సీనియర్ జర్నలిస్ట్ కసిరెడ్డి వెంకట రమణ, అసోసియేషన్ సభ్యులు రెడ్డి రామకృష్ణ, గంధం నగేష్, ప్రభ, వెంకటరావు, చెట్టి రమణ, సత్పల్ సింగ్, అచ్యుత్, వి.కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

అనకాపల్లిలో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ రంగం ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షులు ఆర్‌ఎస్ వి కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ, విద్యుత్ రంగాన్నే అదాని కంపెనీకి కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల్ని, స్మార్ట్ మీటర్లను వారికికట్టబెడుతూ ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతుందని దుయ్యబట్టారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రమాదాలతో పనిచేస్తున్న విద్యుత్ కార్మికులు మాత్రం పర్మినెంట్ చేయడం లేదని సచివాలయం లైన్‌మెన్ లను, విద్యుత్ రంగంలో విలీనం చేయాలని వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌తో భవిష్యత్తులో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వరం సంస్థల ప్రైవేటీకరణ చర్యలను కార్మికలోకం తీవ్రంగా వ్యతిరేకించాలని, ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ.శ్రీనివాసరావు, అవతారం, కేదారేశ్వర రావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము పిలుపునిచ్చారు. ఆదివారం అచ్యుతాపురంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామాసదాశివరావు, సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు, అంగన్వాడీ, ఆశాలు, మిడ్డేమీల్స్ కార్మికులు, ఆటో,ముఠా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కె. కోటపాడు: లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో మండలంలో ఆటో యూనియన్ రైతు శ్రామికవర్గం అంతా పాల్గొనాలని సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఆనందపురం గ్రామంలో ఆటో, ముఠా కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ, ఆటో కార్మికులకు శరాఘాతంగా ప్రవేశపెట్టిన రోడ్డు రవాణా చట్టంతో పెద్దఎత్తున జైలుశిక్షతోపాటు జరిమానా విధించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర హామీ అమలుకాలేదన్నారు. ఈ నెల 20న జరిగిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యలమంచిలి : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని మండల సిఐటియు కార్యదర్శి చింతకాయల శివాజీ పిలుపునిచ్చారు. ఆదివారం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. శివాజీ మాట్లాడుతూ లేబర్ కోడ్స్, 1214 మెమోను రద్దుచేసి కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సొంతింటి కల నిజం చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు.కార్యక్రమంలో కార్మికుల శంకరరావు, అప్పారావు, వేగి అప్పలరాజు, శ్రీను పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మద్దిలపాలెంలో జాతీయ సమ్మె పోస్టర్‌ను జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి తీసుకొచ్చిన నల్ల చట్టాలకు రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన మద్దతు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో శ్రావణ్, యశ్వంత్, రమణ, కనకరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొమ్మాది : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల 20వ తేదీన చేపట్టే కార్యక్రమాల్లో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం ముద్రించిన పోస్టర్లను ఆదివారం కొమ్మాది కూడలి వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.రాజుకుమార్, పేడాడ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారనీ, అధికారంలోకి వచ్చినా నేటికీ అమలుకు నోచలేదని తెలిపారు. సంక్షేమ బోర్డు నుంచి తీసుకున్న నిధులను వెంటనే తిరిగి జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ త్రిశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎల్.దుర్గారావు, నాయకులు డి.తిరుపతి, పి.సత్తిబాబు, రామన్న, పి.బంగారునాయుడు, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకరరావు

యలమంచిలిలో పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు నేత శివాజీ

కొమ్మాదిలో కరపత్రాల ఆవిష్కరణలో భవన నిర్మాణ కార్మికులు

ముగిసిన చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణ

విద్యార్థులకు దేశభక్తి గీతాలపై శిక్షణ ఇస్తున్న చంద్రరావు

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలోని జవహర్ కమ్యూనిటీ హాల్‌లో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈనెల 7 నుండి ప్రారంభమైన ఈ విజ్ఞాన శిబిరంలో చిన్నారులకు మ్యాజిక్ షో, డ్రాయింగ్, సైన్స్ కథలు వంటి పలు అంశాలపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ముగింపు రోజున ఆదివారం గ్రామానికి చెందిన గాయకులు (ఈటీవీ పాడుతా తీయగా) పొలమరశెట్టి చంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు దేశభక్తి గీతాలాపనపై శిక్షణ ఇచ్చారు. పిల్లలతో వారికి నచ్చిన, వారు నేర్చుకున్న పాటలను పాడించటంతో పాటుగా పాటలలో మెలకువలను నేర్పించారు. జిల్లా చిల్డ్రన్స్ క్లబ్ కోఆర్డినేటర్ బి ఉమామహేశ్వరరావు సైన్స్‌కు సంబంధించిన మ్యాజిక్ షో చిన్నారులను ఆకట్టుకుంది. జనగణ మన జాతీయ గీతంతో ముగిసిన కార్యక్రమంలో ఆర్గనైజర్ రామలక్ష్మి, ప్రోత్సాహకులు ఆళ్ళ మహేశ్వరరావు, నెహ్రూ యూత్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన

స్పెషలిస్టు డాక్టర్లను సత్కరిస్తున్న గ్రామీణ వైద్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : గ్యాస్ట్రిక్, హార్ట్ ఎటాక్, ఫిట్స్ వ్యాధులపై గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక వివేకానంద ఫంక్షన్ హాలులో సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లాశాఖ ఆధ్వర్యంలో వేదశ్రీ ఆసుపత్రి సౌజన్యంతో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారుకార్యక్రమంలో నరాల వైద్య నిపుణులు ఆర్ పవన్ కుమార్, గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ కే. తిరుపతి ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ సింహాచలం నాయుడు, కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కె.మురళీధర్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ టి. సురేష్‌బాబు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక సంఘం ఇన్‌ఛార్జి అలకరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, అల్లాడ త్రినాథ్, జోనల్ కార్యదర్శి గద్దె చిరంజీవి, విశాఖపట్నం ప్రెసిడెంట్ ఆకుల శ్రీనివాస్, అనకాపల్లి గ్రామీణ వైద్య సంఘం నాయకులు అల్లక రాజు, కే.వీరభద్రరావు, వై.వి రమణాజీ,మారోజు సత్యనారాయణ, టీవీ రమణారావు, మహేష్, బత్తుల రమేష్, నీలిమ, అనంత లక్ష్మి అధిక సంఖ్యలో గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కెపి. అగ్రహారం గ్రామంలో గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగు యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు ఖరీఫ్ సాగులో భాగంగా వేసే పంటకు ఎరువులు వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల్లో ఇద్దరు ఉత్తమ రైతులు దేవర తాతబాబు (గురువు), పినిశెట్టి మాణిక్యం (గాంధీ)స్కూల్ చైర్మన్‌లను సత్కరించారు.. కార్యక్రమంలో ఉప సర్పంచ్ డి. ముసిలి నాయుడు మాజీ స్కూల్ చైర్మన్ నూకంబికా ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ జి. నూకరాజు పాల్గొన్నారు.

దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గొల్లవీధి ముప్పన కనకరాజు చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలోఆదివారం టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. సంఘ అధ్యక్షులు రెడ్డి వరప్రసాద్ అధ్యక్షతన కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు నిర్వహణలో సంఘ గౌరవ అధ్యక్షులు ముప్పన సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో ముప్పన సుబ్రహ్మణ్యం సోదరులు కాశి శంకర్ బాబు వీటిని అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కాలెపు తాతాజీ, ఉప్పు సాంబమూర్తి రెడ్డి నారాయణరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎర్ర చక్రవర్తి, బాసిన బాల గురూజీ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో పరేషాన్!

- ప్రధానరోడ్డుపైనే దుర్గంధపు నీటి ప్రవాహం
- పాడైన డ్రైనేజీ.. పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

చోడవరం, చీడికాడ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి- చోడవరం రూరల్: మండల కేంద్రంలో చోడవరం నుంచి చీడికాడ వెళ్లే రహదారిలో ఐటీ కాలనీ దగ్గర ప్రధానరోడ్డుపైనే మురుగునీటి ప్రవాహంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోడ్డు పక్కల్లో ఉన్న డ్రైనేజ్ కప్పుడైపోవడం, పాడవ్వంతో ఇక్కడి వాడకం నీరంతా మళ్లిపోయే వీలు లేకపోవడం తో ప్రతిరోజు ఉదయానికే రోడ్డెక్కిపోతోంది. దీంతో అటుగా వెళ్లేవారు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డంతా కప్పేసేలా మురుగునీరు రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తుండడంతో వాహనదారులు వేగంగా దీన్ని దాటే ప్రయత్నంలో అదే సయమంలో అక్కడెవరైనా పాదచారులుంటే వారిపై మురుగు నీరంతా వెదజల్లబడడంతో నానా ఇబ్బందులకు గురౌతున్నారు. దీనిపై గ్రామపంచాయతీకి, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డెక్కి అడ్డంగా ప్రవహిస్తున్న మురుగునీటితో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి అప్పుడప్పుడూ వాటిని మళ్లించే చర్యలు చేపడుతున్నా తాత్కాలికమే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అధికారుల తీరుపై స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. చోడవరం, చీడికాడ ప్రధాన మార్గం తారురోడ్డుపై మురుగునీటి నిరంతరం ప్రవాహం, ఈ మార్గంలో వాహన రాకపోకలు ఎక్కువగా ఉండడంతో తారురోడ్డు ఎన్నాళ్లో నిలవదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మురుగునీటి వల్ల తారురోడ్డు గుంతలైతే, వాటిని పూడ్చడం గగనమేనని, అలా రోడ్డు పాడవ్వకుముందే మురుగునీరు రోడ్డెక్కకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని, రోడ్డు పాడవ్వకుండా ముందుగానే తగు చర్యలు చేపట్టాలని, మురుగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు, వాహనదారులు మొరపెట్టుకుంటున్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షునిగా అప్పారావు

బలిరెడ్డి అప్పారావు

ప్రజాశక్తి- సబ్బవరం : మండల తెలుగు యువత అధ్యక్షునిగా ఇరువాడ గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. 2012 లో జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగాను, 2008లో ఎన్ఎస్ యుఐ మండల శాఖ అధ్యక్షులుగాను, 2006లో పంచాయితీ వార్డు సభ్యునిగా, ఇందిరమ్మ కమిటీ సభ్యునిగా, 1999నుండి 2004 వరకు భీమలింగేశ్వరస్వామి వారి దేవస్థానం చైర్మన్‌గా పనిచేశారు. తనను తెలుగు యువత అధ్యక్షునిగా నియమించడంపై అప్పారావు హర్షం వ్యక్తం చేస్తూ గండిబాబ్జికు కృతజ్ఞతలు తెలిపారు.

బొడ్డేడకు సత్కారం

ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైసిపి యూత్

ప్రజాశక్తి-మునగపాక: వైసిపి అరకు పార్లమెంటరీ పరిశీలకులుగా బాధ్యతలు చేపట్టిన బొడ్డేడ ప్రసాద్‌ను ఆదివారం అతని క్యాంప్ కార్యాలయంలో మండలంలోని సిరసపల్లి గ్రామపంచాయతీ రామారాయుడు పేట యూత్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామారాయుడుపేటలో మరిడిమాంబ పండగకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో వి.రత్నాకర్, కుందిరి శ్రీను, సిహెచ్ నరేష్, కుందూరు దేవుడు, శివ నాయుడు, గురుమూర్తి, లక్ష్మణరావు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

405 మందికి ఉచిత కంటి పరీక్షలు

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం138వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 405 మందికి కంటిపరీక్షలు చేశారు. 295 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. 86 మంది రోగులకు మందులు అందజేశారు. 55 మందిని కేటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు మజ్జిగ, తాగునీరు, భోజన సదుపాయం కల్పించారు. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్ నర్ దొరస్వామి మాట్లాడుతూ,బ్రాండిక్స్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దట్టంగా పొగమంచు

భూమికి సమీపంలో పొగ మంచు మేఘాలు

ప్రజాశక్తి- మునగపాక: మండలంలో ఆదివారం ఉదయం కురిసిన పొగ మంచు చూపరులను ఆకట్టుకుంది. డిసెంబర్, జనవరి నెలలో విరివిగా కురిసే పొగమంచు మే నెలలో కనిపించి పలువురిని విస్మయపరిచింది. భూమికి అడుగు ఎత్తులో మేఘాల వలె కనిపించిన ఈ పొగమంచు ప్రకృతి పర్యావరణ ప్రేమికులను కట్టిపడేసింది. వేసవికి ముఖద్వారమైన మే నెలలో ఈ విధంగా పొగ మంచు కురవటం ఎండల తీవ్రతకు సంకేతమని వృద్ధ రైతులు చెబుతున్నారు.

గోవాడ సుగర్స్‌ను గాడిలో పెట్టండి

ప్రజాశక్తి -చోడవరం : గోవడ చక్కెర కర్మాగారాన్ని ఓ గాడిలో నిలవాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుకు ఆదివారం సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, బిజెపి నేత ఎఆర్‌జె శర్మ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీకి రూ.100 కోట్లు గ్రాంటు మంజూరు చేయించాలన్నారు. ఎంపీ సీఎం రమేష్‌తోపాటు చోడవరం మాడుగుల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు గోవాడ సుగర్స్ స్థితిగతులను సిఎం చంద్రబాబుకు వివరించి, ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

టిడిపికి స్థల కేటాయింపుపై విమర్శలు

- జనసేనకే రిమార్క్
- ఎన్నికల ముందు నానయాగీ చేసిన ఆ పార్టీ కార్యకర్తలు
- జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆఫీసులకు స్థలాలు లేకున్నా మౌనం

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి జిల్లా కేంద్రంలో టిడిపి కార్యాలయానికి స్థల కేటాయింపుపై పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తుతున్నాయి. కూటమి నేతలు అందరూ కుమ్మక్కై, అవినీతి, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే విపక్ష విమర్శలకు నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లా కేంద్రంలో మెజార్టీ ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరాయిపంచన, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పరిస్థితుల్లో, టిడిపి కార్యాలయానికి స్థల కేటాయింపు అంత ప్రాధాన్యమా అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిడిపి సంగతి పక్కన పెడితే. జనసేన సీనియర్ నాయకులు కొణతల రామకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ, ఇంత విలువైన ప్రజా స్థలాన్ని పార్టీకి కేటాయింపుపై పెద్ద ఎత్తున చర్చ లేస్తుంది. ఎన్నికల ముందు వైసిపి కార్యాలయం కోసం జనసేన శ్రేణులు నానాయాగి చేయడాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఇపుడు కూటమి ప్రభుత్వంలో అధికార భాగస్వామిగా జనసేన ఉన్న పరిస్థితుల్లో టిడిపికి స్థలకేటాయింపుపై పలువురుముక్కున వేలేసుకుంటున్నారు.

జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్వేనెంబర్ 608/10లో రూ.కోట్ల విలువైన రెండెకరాల స్థలాన్ని కేవలం ఎకరాకు రూ.రెండు వేలకే లీజు ప్రాతిపదికన టిడిపి కార్యాలయానికి కేటాయించారు.. నిజానికి అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడి ఐదేళ్ల కావస్తున్నా నేటికీ ఏ ప్రభుత్వ కార్యాలయానికి సొంత భవనం లేదు. కలెక్టరేట్ మొదలుకుని ప్రధాన కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. విసిరేసినట్లు చెరోచోట ఉన్న ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు నానా అవస్థలు పడాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను సమకూర్చాలంటే ముందుగా వాటిని స్థలం కేటాయింపులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీలైతే అన్ని కార్యాలయాలకు ఒకే చోట స్థలాన్నిస్తే ఇంకా మంచిదే. ప్రజాప్రయోజనం కోసం ఆ దిశగా అడుగులేయాల్సిన పాలకులు స్వలాభం చూసుకుంటున్నారు. గత వైసిపి హయాంలోనూ ఆ పార్టీ కార్యాలయానికి ప్రజాప్రయోజనం కోసం ఉంచిన స్థలాన్ని కేటాయించి నిర్మాణాలు చేపట్టడంపై అప్పట్లో జనసేన పెద్దఎత్తున ఆందోళన చేపట్టింది. ఇపుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపికి అలాగే లీజు ప్రాతిపదికన స్థల కేటాయింపులు చేశారు.అదీనూ గతంలో కోర్టు భవనానికి అలాగే పార్కు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు పరిశీలన చేసిన స్థలాన్ని కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టిడిపి కార్యాలయానికి కేటాయించిన విలువైన ప్రజా స్థలం

అయితే దీనిపై టిడిపి కన్నా జనసేనకే మచ్చనే చర్చ నడుస్తోంది. విపక్షంలో ఉన్నపుడు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేతలకు ఎక్కడా పొంతన లేదనే విమర్శలున్నాయి. సీనియర్‌గా చెప్పుకునే కొణతల ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఇలాకాలో ఇలా అక్రమంగా స్థల కేటాయింపులు విమర్శలకు తావిస్తున్నాయి. దీని ప్రభావం పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై పడే అవకాశాలున్నాయనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక జనసేన ఎమ్మెల్యే, కూటమి పాలకులు ఎలా స్పందిస్తారో చూపాలి.

టిడిపి మండల, గ్రామ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి- సబ్బవరం : టిడిపి మండల అధ్యక్షునిగా అమృతపురం గ్రామానికి చెందిన గండి ముత్యాల నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గొట్టివాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి ఆధ్వర్యంలో టిడిపి మండల, గ్రామ కమిటీలను నియమించారు. మండల టిడిపి అధ్యక్షులుగా గండి ముత్యాలనాయుడు, ఉపాధ్యక్షులుగా సాలాపు సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గండి దేముడు, కుచ్చర్లపాటి రామకృష్ణ రాజు, అమరపిన్ని నరసింగరావు, కార్యదర్శులుగా నోట్ల శ్రీను,మొల్లి కనక రాజు, ఆడారి నాగరాజు, కోశాధికారులుగా రెడ్డి దేముడు, బలిరెడ్డి నూకరాజు, పైల రమణలను ఎన్నుకున్నారు.

ఆరోసారి ఏకగ్రీవంగా..

మండల టిడిపి పార్టీ అధ్యక్షునిగా గండి ముత్యాల నాయుడును ఆరోసారి ఏకగ్రీవంగా నియమించారు. 2004 నుండి 2017 వరకు ఐదుసార్లు ఏకగ్రీవంగా మండల టిడిపి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన గండి

ముత్యాలనాయుడును అభినందిస్తున్న బాబ్జి, ఇతర టిడిపి నేతలు

ముత్యాల నాయుడును ఆరోసారి ఆ పదవి వరించడంపై పలువురు అభినందనలు తెలిపారు. అమృతపురం సర్పంచ్‌గా రెండుసార్లు, ఎంపిటిసిగా రెండుసార్లు పదవులు చేపట్టిన ముత్యాలనాయుడు, 2004-09 మధ్య టిడిపి కష్టకాలంలో పార్టీ కేడర్‌ను ఏకతాటిపై నిలిపిన ఘనత ఉంది. తనను మండల టిడిపి అధ్యక్షునిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మండల పార్టీ కేడర్‌కు గండి బాబ్జికి ముత్యాలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో టిడిపి నేతలు గండి వంశీదీప్, బర్నికాన సాయినాథరావు, బొండా సత్యారావు, గండి దేముడు, రొంగలి దేముడు, పివివిఎస్ఎన్.రాజు, దాసరి వెంకటరమణ, బొబ్బరి కన్నారావు, పల్లా తాతారావు, దాడి కన్నం నాయుడు, పెద్దాడ రమణమ్మ పాల్గొన్నారు.

టిడిపి గ్రామ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

బుచ్చయ్యపేట : మండలంలోపూడి బంగారుమెట్ట, వడ్డాది తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి బంగారుమెట్ట పంచాయతీ టిడిపి గ్రామ కమిటీ చైర్మన్‌గా దొండ వెంకటరమణ వైస్ చైర్మన్‌గా సకల శ్రీను, వడ్డాది టిడిపి గ్రామ కమిటీ చైర్మన్‌గా దొండ నరేష్ వైస్ చైర్మన్‌గా ముత్యాల సూరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కార్యక్రమంలో దొండ శ్రీను ఎల్లపు జగ్గారావు సాయం శేషు దొండ రమేష్ తలారి శంకరరావు పాల్గొన్నారు

దోలాయమానంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం

- 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్‌కు నోటీసు
- సంతకాల నిర్ధారణకు మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశం
- ప్రలోభాల ఎరలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు
- ఒక్క ఫోను కాల్‌తో క్యాంపు నుంచి ముగ్గురు డ్రాప్

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తాలపై అవిశ్వాసం ప్రకటిస్తూ 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందింది. దీనిపై స్పందించిన కలెక్టర్ కౌన్సిలర్ల సంతకాలు సరైనవో కావో సరిచూడాలంటూ మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజును ఆదివారం ఆదేశించినట్లు సమాచారం. సోమవారం దీనిపై పరిశీలన తర్వాత మున్సిపల్ కమిషనర్ కలెక్టర్‌కు నివేదించనున్నారు.

ఇదిలా ఉంటే శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందించిన తర్వాత అనేక ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. విశ్వసనీయ వర్గాల కథనాల ప్రకారం 'అవిశ్వాస నోటీసు'పై సంతకాలు చేసిన 16 మందిలో వైసిపి నుంచి చైర్‌పర్సన్ రమాకుమారి వర్గంలోకి చేరిన ఆ పార్టీ కౌన్సిలర్లు కొందరు గతంలో క్యాంపు రాజకీయాల్లో ఆర్థిక లాభం పొందారని తెలిసింది.ఈ నేపథ్యంలో వారినే పావులుగా చేసుకొని వైస్ చైర్మన్ల 'అవిశ్వాస' నోటీసుపై సంతకాలు చేయించి జిల్లా కలెక్టర్‌కు పంపారని కథనాలు వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో పదవు దక్కించుకోవడానికి వైస్ చైర్మన్లు రాజీనామా చేసే స్థితికి చేరుకోవడంతో వైసిపి అధిష్టానం రంగంలోకి దిగింది. బొత్స సత్యనారాయణ, ధర్మశ్రీ, కన్నబాబురాజు శనివారం రంగంలోకి దిగి పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కౌన్సిలర్లలో ఎవరికైనా ఆర్థిక

యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

ఇబ్బందులుంటే వారిని ఆదుకుంటామని భరోసా ఇచ్చినట్లు సమాచారం. దాంతో అవిశ్వాసంపై సంతకాలు చేసిన కౌన్సిలర్లలో ముగ్గురు క్యాంపు వెళ్లేందుకు సిద్ధమై, చివరి నిమిషంలో ముగ్గురు సర్దుకున్న బట్టలు కూడా వదిలేసి పలాయనం చిత్తగించినట్లు చెప్పుకుంటున్నారు. ప్రజల ఓట్లతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఇలా విలువలకు పాతరేసి ప్రలోభాలకు లొంగడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు ఇదిలా ఉండగా, కమిషనర్ ప్రసాదరాజు సంతకాల నిర్ధారణ తర్వాత, కలెక్టర్ ఇచ్చే నోటిఫికేషన్ ప్రకారం వైస్‌చైర్మన్లపై బలపరీక్షలో 'అవిశ్వాసం' గట్టేక్కేనా, లేక వీగిపోయేనా అన్నది వేచి చూడాల్సిందే!

తారెత్తిస్తున్న ఎండలు

- వడ దెబ్బకు జనం విలవిల - అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు

ఉపమాకలో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి- నక్కపల్లి:సూర్య ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. ఆదివారం భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో జనం విలవిల లాడారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం బయటకు రావడానికి హడలిపోతున్నారు. ఆదివారం 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుండే భానుడు ఎండ తీవ్రతతో విరుచుకుపడ్డాడు. మధ్యాహ్నం 12, 1 గంట సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రయాణాలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బైక్‌లపై ప్రయాణం సాగించేవారు ఎండ దెబ్బకు గుర్రై తీవ్ర అవస్థలు పడ్డారు. జాతీయ రహదారి గుండా ప్రయాణం సాగించే ప్రయాణికులు జ్యూస్ పాయింట్ల వద్ద ఆగి, చల్లని పానీయాలు సేవించి కొద్దిసేపు సేదతీరి తిరిగి ప్రయాణాలను కొనసాగించారు. మహిళలు చీర కొంగులను కప్పుకుని, గొడుగులు వేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. ముఖ్యంగా పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండ తీవ్రతకు భయపడి జనం బయటికి రావడానికి ఇష్టపడటం లేదు. చాలామంది ప్రయాణాలను వాయిదా వేసుకుం టున్నారు. ఎండ తీవ్రతకు భయపడి జనం పెద్దగా బయటకు రానందున జాతీయ రహదారి, ప్రధాన ప్రాంతాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దుకాణాల వద్ద కూడా జనసంచారం పెద్దగా కనిపించడం లేదు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, కూలీల బాధలు వర్ణనాతీతం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఇబ్బందులు పడుతూ తప్పని పరిస్థితుల్లో తమ పనులను చేపడుతున్నారు.ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నాయి.

స్పీకర్‌కు జ్ఞాపికను అందిస్తున్న మేయర్ పీలా

స్పీకర్‌ను కలిసిన విశాఖ నగర మేయర్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును విశాఖపట్నం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా నర్సీపట్నంలోని స్పీకర్ స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ విశాఖపట్నం నగర అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలపై విలువైన సూచనలను మేయర్ కు సూచించారు. విశాఖ నగర ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలకు, సంక్షేమ కార్యక్రమాలకు, నగర అభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా అభివద్ధి కార్యక్రమాలు చేపట్టి అమలు చేయాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తగిన సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మేయర్ కు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ నగర అభివద్ధికి సూచనలు, సలహాలు అందించి మంచి పాలనతోపాటు విశాఖ నగర అభివద్ధికి సహకరించాలని మేయర్ స్పీకర్‌ను అభ్యర్థించారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1999 -2000 సంవత్సరంలో టెన్త్ పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కటిగా చేరి చిన్ననాటి తీపి స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, జీవితంలో పిల్లలు అభివృద్ధి చెందితే తల్లిదండ్రులు తర్వాత ఆనందపడేది గురువులేనన్నారు.పిల్లలు ఉన్నత స్థానంలో ఉంటే గర్వపడేది వీరు ముగ్గురే అన్నారు. ఈర్ష్య ద్వేషాలు ఉండవన్నారు. గురువులు ఆనందపడేది విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నప్పుడే అన్నారు. మీ పిల్లల్ని కూడా మంచి మార్గంలో నడిచేలా చేయాలన్నారు.

పుస్తకాలు చదవడంతో విజ్ఞానం

- కొనసాగిన గ్రంథాలయ వేసవి శిబిరాలు

నక్కపల్లిలో పఠిస్తున్న విద్యార్థి

ప్రజాశక్తి -నక్కపల్లి:పుస్తకాల చదవడంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి జనార్ధన్ అన్నారు. మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. విద్యార్థులకు అవసరమగు పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేసే అలవాటును అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి జనార్ధన్ సూచించారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం ఖోఖో, మ్యూజికల్ చైర్ ఆటలపోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జగన్ మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రంథాలయాన్ని సందర్శించి తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలని, పిల్లలు ఆటలపై దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చేనెల 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ తాతయ్యబాబు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-వడ్డాది : మండలంలోని ఎల్‌బిపి అగ్రహారంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. విఎస్ఆర్ సేవాసంస్థ సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ప్రారంభించారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్‌తోపాటు కార్డియాలజీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, యూరాలజీ వైద్య పరీక్షలు చేశారు. 35 మందికి ఇసిజి పరీక్షలు చేసి, ఏడుగురిని గుండె సంబంధిత సమస్యలున్నట్లు గుర్తించి వైజాగ్ మెడికవర్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. పుష్పగిరి కంటి హాస్పిటల్ వైద్యులు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి, 15మందిని ఆపరేషన్లకు గుర్తించి కంటి ఆసుపత్రికి తరలించారు..రోగులకు బిపి, సుగర్ చెకప్‌లు ఉచితంగా చేసి మందులిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొండా రాంబాబు, ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు, సర్పంచ్ మొల్లి శ్రీను, బాబూరావు, తమరాన దాసు, దొండా శ్రీను, సాయం శేషు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:కృషి విజ్ఞాన కేంద్రం కొండేంపూడి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కింజరపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం పి భీమవరం గ్రామంలో టైం లైన్ ద్వారా పూర్వకాలం నుండి నేటి వరకు సాగులో ఆధునిక పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, ప్రసన్న, మమత, హేమ, హారిక, ప్రియ పాల్గొన్నారు.

కొత్తకోట:స్థానిక వనరులతో గ్రామాలను అభివృద్ధి చేసుకో వచ్చునని కింజరపు ఎర్రం నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. రావికమతం మండలం మత్స్యవానిపాలెం గ్రామంలో ఆదివారం కొండేంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టివో టి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్థానిక వనరులను ఉపయోగించు కోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామ ముఖ్య కూడలిలో గ్రామ చిత్ర పటం వేసి వనరులు- లభ్యత అనే అంశం పై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రచన, చెరిష్మా, బిందు మాధవి, మేఘన, అంకిత, మణిదీపిక పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మోదకొండమ్మ ఉత్సవం

ఘటాలను మోస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు పట్టణంలో ప్రారంభమైన మోదకొండమ్మ జాతర తొలిరోజు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువ జామున మంచు ముసుగులో అమ్మ వారి పాదాలు, ఘటాల ఊరేగింపు డప్పు వాయిద్యాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తి పారవశ్యంతో నిర్వహించారు. ఈ కొలువు ఉత్సవంలో భక్తులు అమ్మవారి ఘటాలను ఊరేగించేందుకు ఎగబడ్డారు. శతకంపట్లో అమ్మవారిని కొలువు తీర్చిన తర్వాత సాయంత్రం కూడా పురవీధుల్లో భక్తుల సందర్శనార్థం ఘటాల ఊరేగింపు నిర్వహించారు.. స్థానిక ఎమ్మెల్యే ఆలయ కమిటీ/ ఉత్సవ కమిటీ చైర్మన్ విశ్వేశ్వర రాజు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటి బాబు తదితరులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాదాలను ఘటాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు.కొలువు ఉత్సవం వివిధ నేల వేషాలు బాణాసంచా, డప్పు వాయిద్యాలతో మారుమోగింది. మూడు రోజుల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల లైటింగ్ సెట్లు, విద్యుత్ దీపాల అలంకరణతో పాడేరు పట్టణమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆకట్టుకున్న అడ్వెంచర్ రైడ్స్ ఎగ్జిబిషన్

ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. జైంట్ వీల్స్ తో పాటు కొలంబస్ బ్రేక్ డాన్స్ డ్రాగన్ ట్రైన్, జారుడుబల్లలు వంటి వినోదాత్మక సాహసోపేతమైన గేమ్ షోలు సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమం అభివృద్ధి పై వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ కూడా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా పట్టణమంతా వివిధ రకాల వస్తు దుకాణాలు ఏర్పాటయ్యాయి. పాడేరు పట్టణమంతా జన సందోహంతో సందడిగా మారింది.

థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

సామూహిక వివాహాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్, వికాసతరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో త్రిదండి చిన్న శ్రీమన్ నారాయణ చిన్న జీయర్ స్వామి సమక్షంలో ఈనె 30న శుక్రవారం ఉదయం 10 గంటలకు గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోని ఉన్నత జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో 108 ఆదివాసి జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నారు. ఈ సామూహిక వివాహాల కార్యక్రమానికి సంబంధించిన పత్రికను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి – గాజువాక : తన నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సోమవారం ఆయన జన్మదినోత్సవం. ఆ సందర్భంగానూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది సమీపిస్తున్న నేపథ్యంలోనూ 'ప్రజాశక్తి'తో ఆయన ఆదివారం కాసేపు ముచ్చటించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తూ, చట్ట వ్యతిరేకంగా నడుస్తున్న అగనంపూడి టోల్‌గేట్‌ను తాను గెలిచిన వెంటనే తొలగించానన్నారు. దీంతో అగనంపూడి ప్రజలు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు రాకపోకలు సులభతరమయ్యాయన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యకు సంబంధించి జిఒ నెంబరు 45ని తీసుకువచ్చినట్టు తెలిపారు. దీని వల్ల మిగిలి ఉన్న హౌస్ కమిటీ బాధితులందరూ దరఖాస్తు చేసుకుంటే వారి గృహాలు క్రమబద్ధీకరణ జరుగుతాదని తెలిపారు. అదేవిధంగా కొండలపై నివసిస్తున్న ప్రజలందరి కోసం జిఒ నెంబర్ 30ని తీసుకొచ్చామన్నారు. దీంతో గాజువాకలో ఉన్న పెంటయ్య నగర్, శ్రీనగర్, సింహగిరి కాలనీ తదితర కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు క్రమబద్ధీకరణ ఉపయోగకరంగా మారనుందన్నారు. 60 అడుగుల రోడ్డు, వంటిల్లు జంక్షన్ నుంచి నడుపూరుకు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఆ రోడ్డుకు సమాంతరంగా ఆహ్లాదకరమైన పార్కును కూడా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న హెచ్‌బి కాలనీ, అయ్యన్నపాలెం పార్కును త్వరలో వినియోగంలోకి తెచ్చి ప్రజలకు ఉపయోగపడేలా చేస్తానని తెలిపారు. 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమస్యను తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పరిష్కరించినట్టు తెలిపారు. ప్రస్తుతం దాని పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మరో ఏడాదిలో ఆ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వినియోగంలోకి వస్తుందన్నారు. క్రీడాకారులందరికీ ఎంతో ఉపయోగకరంగా మారనుందన్నారు. గంగవరం పోర్టు కాలుష్య సమస్యను, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యకు సంబంధించి డిగ్రీ, పీజీతో పాటు పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆర్థిక ప్యాకేజీని తీసుకొచ్చామన్నారు. పెండింగ్‌లో ఉన్న 8000 మంది ఆర్ కార్డులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అయితే కాంట్రాక్ట్ లేబర్ తొలగింపు, పర్మినెంట్ కార్మికుల వాలంటరీ రిటైర్మెంట్‌పై మాత్రం ఆయన స్పష్టమైన జవాబు ఇవ్వలేదు. ఇప్పటికే మ్యాన్ పవర్ ఎక్కువ ఉందని దాటవేశారు. విశాఖ డెయిరీ కాలుష్య సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీకి రాష్ట్ర అధ్యక్షునిగా ఉండటం వల్ల స్థానికంగా ఉండేందుకు ఎక్కువ సమయం లేకున్నా, ఉన్న సమయంలోనే గాజువాక ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

పల్లా జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి – గాజువాక : గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఈ నెల 12న పాత గాజువాకలోగల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. రెండోసారి గాజువాకలో ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం, దానికి తోడు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కావడంతో ఘనంగా ఈ వేడుకలను నిర్వహించడానికి క్యాడర్ సన్నద్ధమైంది. నియోజకవర్గంలోని ప్రతి కాలనీలోనూ, జంక్షన్లలోనూ పల్లా పుట్టిన రోజు వేడుకల ఫ్లెక్సీలను అభిమానులు ఏర్పాటు చేశారు. అనకాపల్లి నుంచి విశాఖపట్నం వరకూ భారీగా ఫ్లెక్సీలు పెట్టారు. స్థానికంగా జరిగే వేడుకలకు గాజువాక నుంచే కాకుండా జిల్లాలో ఉన్న నాయకత్వంతో పాటు రాష్ట్ర స్థాయి నాయకులు కూడా వచ్చే అవకాశం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా ఆఫీస్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. స్టేజ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా 60 అడుగుల రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. వేడుకలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై ఒంటి గంట వరకూ కొనసాగే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ పుట్టినరోజు వేడుకలు పూర్తయిన వెంటనే పల్లా మధ్యాహ్నం విజయవాడకు బయలుదేరుతారు. అక్కడ టిడిపి యువనేత, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో సాయంత్రం జన్మదిన వేడుకలు జరపనున్నారు.